
# దేవత

అడపా పద్మావతి

రోడ్డు పక్క ఓ బిచ్చగాడు దీనంగా దానం చేసే దొరబాబులవైపు భక్తిగా చూస్తున్నాడు

చూపులు మాత్రమే చూస్తున్నాయి. కాని ఆ చూపుల్లో జీవంలేదు.

గుడ్డము . పరుచుకుని కూర్చున్న బిచ్చగాడి భుజానికి ఓ గుడ్డసంచీ వేలాడుతోంది



జడలు కట్టిన జుట్టూ, ఒంటి మీద అతుకుల బట్టలూ, పెరిగిన గెడ్డం! 'బాబూ... ధర్మం చేయండి. అని నోరారా అరవడు.

కనిపించిన మనుషుల వైపు దైన్యంగా చూస్తాడు.

అతన్ని చూస్తే జాలి పడనివారుండరు.

కార్లూ, బస్సులూ, స్కూటర్లూ మనుషులూ ఎవరి బిజీలో వాళ్ళు ఆతృతగా పరుగులు తీస్తున్నారు. క్షణం తీరికలేని మానవయంత్రాలు!

ఆ బిచ్చగాణ్ణి చూసి, చాలామంది గుడ్డమీద చిల్లరడబ్బులు వేస్తున్నారు.

బిచ్చగాడు దైన్యంగా, శూన్యంలోకి చూస్తున్నాడు.

అతడు ఒకప్పుడు బాగా బతికినవాడే

యంత్ర పరికరాలను తయారుచేసే ఓ కంపెనీలో కార్మికుడిగా పనిచేసేవాడు.

ఓ రోజు ఫ్యాక్టరీలో పనిలో ఉండగా ఇంటి దగ్గర నుంచి ఓ వార్త వచ్చింది.

అతడి భార్య ఆడపిల్లలను కని చపిపోయిందనే కబురు తెలిసి ఆ షాక్‌కి ఎత్తయిన ప్రదేశం మీంచి కిందపడ్డాడు.

కళ్ళలో ఏం గుచ్చుకున్నాయో కూడా అతడికి తెలీదు. ఆనాటినుంచి చీకటే అతడి నేస్తయింది.

ఉన్న ఒక్క కూతుర్ఖూ ఆలనా పాలనీలేక చనిపోయింది.

ఫ్యాక్టరీ యాజమాన్యం నష్టపరిహారం ఇవ్వలేదు సరికదా అతణ్ణి ఉద్యోగం నుంచి తొలగించింది. ఎటు చూసినా చీకటే కనిపించింది. కాస్త వెలుగు కూడా లేదు. తల దాచుకోడానికి కాస్తచోటు కూడా లేదు.

ఆకలి పేగుల్ని మెలిపెడుతూంటే రోడ్డు పక్కన పడిమెలికలు తిరిగాడతడు. అది చూసి ఎవరో ధర్మాత్ములు డబ్బులు విసిరారు.

స్పృహ తెలిసి చిల్లరడబ్బులు ఏరుకున్నాడు. ఆనాటి నుంచీ అతడు బిచ్చగాడిగా మారాడు.

చీకటయింది. తడుముకుంటూ గుడ్డమీద చిల్లర ఏరుకుని గుడ్డసంచిలో వేసుకుంటున్నాడు బిచ్చగాడు.

అతడి జోలెలో ఉన్న డబ్బుల్ని అప్పటికి చాలాసేపు నుంచి గమనిస్తున్నాడో దొంగ.

బిచ్చగాడు మెల్లగా పైకిలేచి, చేతిలో కర్రను నేలకు తాటిస్తూ, మరో చేత్తో తడుముతూ మెల్లగా ముందుకి నడుస్తున్నాడు.

దొంగ వేగంగా ముందుకొచ్చి బిచ్చగాడి భుజానికున్న గుడ్డనుంచి లాక్కుని, ఒక్కదుటున పరుగుతీశాడు.

క్షణంలో జరిగింది గ్రహించిన బిచ్చగాడు వేగంగా. నడుస్తూ అడిగాడు. "బాబూ... నాసంచీ ఇచ్చేయ్ బాబూ. డబ్బులు నా డబ్బులు ఇచ్చేయ్ బాబూ! బాబూ..."

ఆ సంఘటన చూసిన కొంతమంది మనుషులు దొంగ వెనక పరుగెత్తి ఎలాగైతే ఆ దొంగని పట్టుకున్నారు.

వేగంగా నడుస్తున్న బిచ్చగాడు ఓ రాయిని తన్నుకుని బోర్లా పడిపోయాడు. అతడి తలకు మరోరాయి తగిలి

రక్తం చిందింది.

ఎవరో బిచ్చగాణ్ణి ఎవరో మెల్లగా లేపారు. మరెవరో అతడి చేతిలో గుడ్డసంచీ పెట్టారు.

సంచి స్పర్శకు బిచ్చగాడి మొహంలోకి కళ వచ్చింది.

"దొరికిందా బాబూ... నా సంచి నాకు తెచ్చారా..."

ఎవరో అంటున్నారు. "దొంగ వెధవని చావకొట్టండి. బిచ్చగాడి చిల్లర దొంగతనం చేస్తాడా! కొట్టండి."

దొంగ అరుపులు వినిపిస్తుండగా బిచ్చగాడు వాళ్ళ మధ్యకి వచ్చాడు. "కొట్టకండి బాబూ... కొట్టకండి..."

అంతా బిచ్చగాడి వైపు ఆశ్చర్యంగా చూసి ఆ దొంగని వదిలేశారు.

జోలెని గట్టిగా పట్టుకుని బిచ్చగాడు ఇంటిముఖం పట్టాడు.

★ ★ ★

అతడి నివాసం ఓ ఇంటి అరుగు. ఆ ఇంట్లో భర్తపోయిన ఓ స్త్రీ ఉంటోంది. ఆమె నలుగురికీ వంటవండి భోజనం పెట్టి, ఆ వచ్చిన ఆదాయం మీద జీవితం గడుపుతోంది.

ఒంటరి ఆడది మంచి మనసున్న స్త్రీ మూర్తి, బిచ్చగాడికి కూడా ఆమే భోజనం పెడుతోంది.

ఆమె అంటే బిచ్చగాడికి చాలాగురి. అలాంటి మంచి మనసున్న స్త్రీమూర్తిని అతడెప్పుడూ చూడలేదు.

ఆమె ఆదరణ, ఆప్యాయతలను అతడెప్పుడూ మర్చిపోలేదు. డబ్బులు లేనప్పుడు కూడా అతడికామె భోజనం పెట్టింది.

చలివేస్తే దుప్పటి ఇచ్చింది. జ్వరం వస్తే - కషాయం కాసిచ్చింది. ఆమె పేరు అనసూయ.

అతడికి కళ్ళుంటే బావుండునని ఎంతో కోరికగా ఉంది.

ఆ కళ్ళతో లోకాన్ని చూడటానికి కాదు, కన్నతల్లిలా తను చూస్తోన్న ఆమెను చూడడానికి!

ఆమె అతడికి దైవ స్వరూపం!

ఆ బిచ్చగాడు రోజూవచ్చే 'డబ్బుల్లో కొంత డబ్బు అనసూయ దగ్గర దాచుకుంటున్నాడు.

అరుగును సమీపించి మెల్లగా కూర్చున్నాడు బిచ్చగాడు.

"వచ్చావా తాతా..." అంటూ తలుపు తెరిచింది అనసూయ.

తల ఎత్తాడు బిచ్చగాడు.

"ఈ డబ్బు లెక్కగట్టి నీ దగ్గర ఉంచమ్మా..." అంటూ జోలెలో చెయ్యి పెట్టి, చిల్లర గుప్పెళ్ళతో తీసి గచ్చుమీద కుప్పగా పోశాడు.

ఆమె చిల్లరంతా లెక్కగట్టింది. "తాతా. నలభై రూపాయలున్నాయి.

"అలాగేనమ్మా..." తలవూపాడు బిచ్చగాడు.

"నీ డబ్బు ఇప్పటికి పాతికవేలు పోగయింది. ఈ డబ్బుతో నీ కళ్ళు బాగు చేయించుకోవచ్చు కదా!"

"పాతిక వేలకి కళ్ళొస్తాయా అమ్మా."

"డాక్టర్ని అడిగి చూద్దాం."

"అలాగేనమ్మా... నిన్ను చూడటం కోసమన్నా నా కళ్ళు బాగు చేయించుకుంటాను" అన్నాడు బిచ్చగాడు.

"సరే... ముందు అన్నం తిను తాతా. ఇప్పటికే చాలా ఆలస్యమైంది" అంటూ ఆకు తెచ్చి అతడి ముందు పెట్టి అన్నం వడ్డించింది అనసూయ.

★ ★ ★

మరునాడు ఉదయం బిచ్చగాడు నిద్రలేచేసరికి వీధి అంతా గోలగోలగా ఉంది. అతడికేమీ అర్థం కాలేదు.

"ఏం జరిగింది బాబూ... ఏం జరిగింది?" అంటూ బిచ్చగాడు రెండు మూడుసార్లు అడిగిన మీదట ఎవరో వ్యక్తి ఆగాడు...

"నీకు తెలీదా!... అన్నంపెట్టే అనసూయ దర్జీవాడితో లేచిపోయింది."

"నేను నమ్మను... నేను నమ్మను." పెద్దగా అరిచాడు బిచ్చగాడు.

"నమ్మకపోతే మానేయ్. జరిగింది మాత్రం అదే..." అంటూ తనదారిని తాను వెళ్ళిపోయాడా వ్యక్తి.

ఖాళీ సంచీ భుజానికి తగిలించుకుని, కర్ర తాటించు కుంటూ అక్కడినుంచి కదిలాడు బిచ్చగాడు.

"బాబూ... బాబూ..." అంటూ మరోవ్యక్తిని ఆపాడు. ఏం జరిగిందని అడిగాడు.

"పూట కూళ్ళ అనసూయ, దర్జీ సుబ్బారావు లేచిపోయారు తాతా...యవ్వనంలో ఉన్నారు. ఇద్దరూ ఒంటరివాళ్ళే. రాత్రికి రాత్రే లేచిపోయారు" అని చెప్పాడా వ్యక్తి.

ఆ నిజాన్ని ఆ బిచ్చగాడు జీర్ణించుకోలేక పోతున్నాడు. నమ్మకలేక పోతున్నాడు.

సాధుజీవి ప్రాణం తీసిందంటే ఎలా నమ్మగలడు. అనసూయలాంటి ప్రేమమూర్తి తన డబ్బుపట్టుకుపోయి తనను మోసం చేసిందంటే అతడెలా విశ్వసించగలడు.

డబ్బు పోయినందుకు అతడికి బాధలేదు. మూటాముల్లె సర్దుకుని ఆమె లేచిపోయిందనే మాట అబద్ధమైతే ఎంత బావుండును అనుకున్నాడు.

"బాబూ, ఆమె లేచిపోలేదు బాబూ... ఆమె దేవత... ఎవరో ఆమెని మోసం చేసి తీసుకుపోయారు. ఎవరో ఆమెని మోసం చేశారు! అదే నిజం కదూ!" అన్నాడు బిచ్చగాడు.

"కాదు... లోకమంతా కోడై కూస్తూంటే నువ్వు మరోలా చేప్తావేమిటి?" అంటూ వెళ్ళిపోయాడా వ్యక్తి.


కర్ర నేలను తాటిస్తూ మెల్లగా ముందుకి నడుస్తున్నాడు బిచ్చగాడు.

అనసూయ ఆదరణ, ఆప్యాయత అతడికి గుర్తుకు వస్తున్నాయి.

బిచ్చగాడి కుళ్ళల్లో గోదారి పొంగింది.

"లేదు... లేదు ఆ దేవత అలా ఎన్నటికీ చెయ్యదు. ఆమె నెవరో మోసం చేశారు. ఆమె నిజంగా దేవత. దేవత..." గొణుక్కుంటూ వెళ్ళిపోతున్నాడు ఆ బిచ్చగాడు.

శ్రీమతి అడపా పద్మావతి
ప్లాట్ నం: 67, విద్యానగర్,
సికింద్రాబాద్ - 500 003.




ఉప్పల శ్రీనివాస్, కేరాఫ్. బోసు, కొత్తపల్లి (గ్రామం), మాక్లూర్ (మం), నిజామాబాద్ (జిల్లా).